




జేసీతో మాట్లాడుతున్న కౌలు రైతు సంఘం నాయకులు

అర్జీలను వేగంగా పరిష్కరించండి : జేసీ

భీమవరం టౌన్, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి) : ప్రజల నుంచి అందిన అర్జీలను అధికారులు క్షుణ్ణంగా పరిశీలించి నాణ్యమైన పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని, నిర్దేశించిన గడువులోగా పరిష్కరించాలని జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి సూచించారు. సోమవారం కలెక్టరేట్‌లో జరిగిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో మొత్తం 198 అర్జీలను స్వీకరించారు. జేసీ మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కారంపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందన్నారు. తమ శాఖ పరిధిలో లేని ఫిర్యాదులు వస్తే వాటిని తక్షణమే సంబంధిత శాఖ అధికారులకు పంపించాలన్నారు. లబ్ధిదారులతో స్వయంగా మాట్లాడి సమస్యలను పరిష్కరించా లన్నారు. డీఆర్వో బి.శివన్నారాయణ రెడ్డి, గ్రామ, వార్డు సచివాలయ అధికారి వై.దోసి రెడ్డి, డ్వామా పీడీ అప్పారావు, కలెక్టరేట్ ఏవో వెంకటేశ్వర రావు అర్జీలను స్వీకరించారు.

ధాన్యం తూకాల్లో మోసాలను అరికట్టండి

ధాన్యం తూకాల్లో మోసాలు అరికట్టి రైతుసేవా కేంద్రంలో వచ్చిన తేమశాతమే ఫైనల్ చేయాలని ఏపీ కౌలురైతుల సంఘం ఆధ్వర్యంలో జేసీకి వినతిపత్రం అంధజేశారు. సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి మామిడి శెట్టి రామాంజనేయులు మాట్లాడుతూ ధాన్యం తూకాల్లో మోసాలు తీవ్రస్థాయిలో జరుగుతున్నాయని అదనంగా ధాన్యం పట్టినా మిల్లుకి వెళ్లాక తరుగు చూపిస్తున్నారని తెలిపారు. తేమశాతం పేరుతో మోసాలు అరికట్టాల వినతిపత్రం అందజేశారు.



ప్రజా సమస్యలపై నిర్లక్ష్యం వద్దు : ఎస్పీ

భీమవరం క్రైం, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి) : ప్రజా ఫిర్యాదుల నిర్లక్ష్యం వహించకుండా నిర్ణీత గడువులోగా పరిష్కారం చూపాలని జిల్లా ఎస్పీ అద్నాన్ నయీం అస్మి పోలీసు అధికారులను ఆదేశించారు. జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయంలో వివిధ రకాల సమస్యలతో వచ్చిన ప్రజల నుంచి ఫిర్యాదులను ఎస్పీ స్వీకరించారు. వారి సమస్యలను విని విచారణ జరిపి శాశ్వత పరిష్కారం అందిస్తామని భరోసా ఇచ్చారు. సంబంధిత పోలీసు అధికారులతో ఫోన్‌లో మాట్లాడి అర్జీదారుల సమస్యలను చట్టపరిధిలో విచారించి నిర్ణీత గడువులోగా పరిష్కారం చూపాలన్నారు. పలు సమస్యలపై మొత్తం 19 అర్జీలను ఎస్పీ స్వీకరించారు. జిల్లా అదనపు ఎస్పీ (అడ్మిన్) వి.భీమారావు పాలొన్నారు.

అసభ్య ప్రవర్తన.. టీచర్ సస్పెన్షన్

భీమవరం రూరల్ , డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): గొల్లవాని తిప్ప జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో స్కూల్ అసిస్టెంట్‌గా (గణితం) పనిచేస్తున్న సుధీర్ బాబు విద్యార్థినుల పట్ల అసభ్యంగా ప్రవర్తించినందుకు విధుల నుంచి సస్పెండ్ చేసినట్టు జిల్లా విద్యాశాఖాధికారి నారాయణ తెలిపారు.ఈ సంఘటనపై ఈనెల 5న తమకు ఫిర్యాదు అందిందని దీనిపై విచారణ చేసి ఉపాధ్యాయుడిని సస్పెండ్ చేసినట్టు వివరించారు.



యూరియా మాయాజాలం

రబీ సీజన్ ప్రారంభానికి ముందే రైతులు ఎరువుల కోసం ఎగబడుతున్నారు. యూరియా కొనుగోలు చేసుకుని నిల్వ చేసుకుంటున్నారు. ఇదే అదనుగా దళారులు కృత్రిమ కొరత సృష్టిస్తున్నారు. ధరలు పెంచి అమ్మకాలు సాగిస్తున్నారు. గడచిన పదేళ్లలో ఇటువంటి దందా ఎప్పుడూ చేయలేదు. మార్కెట్‌లో యూరియా బస్తాపై రూ. 80 అధికంగా విక్రయిస్తున్నారు.

- సీజన్ కంటే ముందుగానే కొనుగోలు చేస్తున్న రైతులు
- బస్తాకు అదనంగా రూ.80 బాదుతున్న దళారులు
- భగ్గుమంటున్న ధరలు
- జిల్లాకు అవసరమైనది 40 వేల టన్నులు.. నిల్వ 9 వేల టన్నులు

(భీమవరం-ఆంధ్రజ్యోతి)

జిల్లాలో రబీకి అత్యధికంగా ఎరువులను వినియోగిస్తారు. యూరియా వినియోగం కూడా అధికంగా ఉంటోంది. నారుమడి ప్రారంభం నుంచే యూరియా వేయడం ప్రారంభిస్తారు. దమ్ములోనూ వినియోగిస్తారు. ఖరీఫ్ మసూళ్లు పూర్తయిన పంటపొలాల్లో రైతులు నారుమళ్లను సిద్ధం చేసుకున్నారు. నాట్లు ప్రారంభం అయ్యేనాటికి ఎరువులు ఉండాలన్న ఉద్దేశంతో రైతులు యూరియా కొనుగోలు చేస్తున్నారు. ఖరీఫ్‌లో ఇతర జిల్లాల వరకే కొరత పరిమితమైంది. అక్కడ అధిక ధరలకు అమ్మకాలు సాగించారు. జిల్లాలో అధికారులు పక్కా ప్రణాళికతో ఖరీఫ్‌ను గట్టెక్కించారు. ఉన్న ఎరువులను సక్రమంగా సరఫరా చేశారు. రబీలో మాత్రం ఎరువులకు ఇప్పుడే డిమాండ్ ఏర్పడింది.

బ్లాక్‌లో యూరియా ధర రూ. 345

యూరియా బ్లాక్ మార్కెట్ నడుస్తోంది, గతంలో యూరియాను రూ. 265 విక్రయించేవారు. కేంద్రం యూరియాపై రాయితీ ఇస్తోంది. దాంతో తక్కువ ధరకే యూరియా సరఫరా అవుతోంది. కాంప్లెక్స్ ఎరువు ధర రూ. 1500 వరకు ఉంటోంది. దాంతో రైతులు యూరియాను అధికంగా వినియోగిస్తున్నారు. రబీలో వినియోగం మరింత ఎక్కువగా ఉంటుంది. ఎకరానికి గరిష్టంగా మూడు బస్తాలు వాడుతుంటారు. మరికొద్దిరోజుల్లోనే పశ్చిమడెల్టాలో నాట్లు ప్రారంభం కానున్నాయి. రైతులు ఇప్పటినుంచే నిల్వ చేసుకునే ప్రయత్నం చేస్తున్నారు. ఇదే ఆసరగా చిల్లర వర్తకులు, దళారులు బస్తాకు రూ.80 అదనంగా దోపిడీ చేస్తున్నారు. ఏమంటే తాము అధిక ధరలు చెల్లించి కొనుగోలు చేస్తున్నామని చెప్పుకొస్తున్నారు. ప్రభుత్వం ఖరీఫ్ ధాన్యం సొమ్ములు జమ చేయడంతో రైతులు కూడా యూరియా ధర కాస్త పెరిగినా సరే పెద్దగా పట్టించుకోవడం లేదు.

పొంచి వున్న ముప్పు

జిల్లాలో రబీకి అవసరమైన ఎరువుల ప్రణాళికను అధికారులు సిద్ధం చేశారు. కాంప్లెక్స్ ఎరువులు 60 వేల టన్నుల, యూరియా 40 వేల టన్నులు అవసరం కానుందని అంచనా వేశారు. కాంప్లెక్స్ ఎరువులు 40 వేల టన్నులు జిల్లాకు దిగుమతి అయ్యాయి. వీటి వరకు ఇబ్బంది లేదు. యూరియా విషయంలోనే ఇబ్బం దులు ఎదురయ్యే అవకాశం కనిపిస్తోంది. ప్రస్తుతం జిల్లాలో 9 వేల టన్నుల ఎరువులు నిల్వ ఉన్నాయి. జనవరి, ఫిబ్రవరి నెలల్లో 2 వేల టన్నులు దిగుమతి చేసుకునేలా అధికారులు ప్రణాళిక చేసుకున్నారు. ఈ నెలలోనే 15వేల టన్నుల వరకు అవసరం కానున్నాయి. సొసైటీల వద్ద పుష్కలంగా యూరియా లభ్యమైతే ఇబ్బంది ఉండదు. ఖరీఫ్‌లో అదే చేశారు.

వినియోగం తగ్గించే ప్రయత్నం

కేంద్ర ప్రభుత్వం యూరియా వినియోగాన్ని తగ్గించాలంటూ చెప్పుకొస్తోంది. యూరియా అధిక వినియోగం వల్ల భూసారం దెబ్బతింటోంది. భూ సహజ సిద్ధ స్వభావాన్ని కోల్పోతోంది. వ్యవసాయ శాఖ అధికారులు సైతం రైతుల్లో అవగాహన కల్పిస్తున్నారు. సేంద్రియ, ప్రకృతి వ్యవ సాయాలకు మళ్లించే ప్రయత్నం చేస్తున్నారు. తద్వారా వ్యవసాయ పంటలకు చీడ, పీడల బెడద తగ్గుతుందని దిశానిర్దేశం చేస్తున్నారు. అయినా సరే రైతులు మాత్రం యూరియా వాడకాన్ని తగ్గించే ప్రయత్నం చేయడం లేదు. తక్కువ ధరకు లభ్యమవుతుందన్న ఉద్దేశంతో యూరియాను విచ్చల విడిగా వినియోగిస్తున్నారు. ఈసారి నిల్వలు తక్కువగా ఉన్నాయి. ఫిబ్రవరి నెల వరకు జిల్లాకు దిగుమతి చేసుకునేలా అధికారులు ప్రణాళిక చేశారు. కానీ క్షేత్ర స్థాయిలో వ్యాపారులు ఇప్పటినుంచే అధిక ధరలకు అమ్మకాలు సాగిస్తున్నారు.

యూరియా ఉత్పత్తి లేకే

జిల్లాకు సరఫరా చేసే యూరియా ఉత్పత్తి కంపెనీలు మూతపడ్డాయి. ఉభయగోదావరి జిల్లాల్లో రైతులు ఎగబడే యూరియా కంపెనీని వైసీపీ ప్రభుత్వం విధానాలతో మూసి వేశారు. దాంతో ఉత్పత్తి మందగించింది. మరోవైపు తమిళనాడు నుంచి దిగుమతి చేసే కంపెనీలు ఉత్పత్తి చేయడం లేదు. ఫలితంగా రాష్ట్రానికి యూరియా దిగుమతులు తగ్గిపోతున్నాయి. గత ఖరీఫ్‌లో రాష్ట్రంలో యూరియా డిమాండ్‌కు ఇదే కారణమైంది. రబీలో కొన్ని జిల్లాలకే యూరియా అవసరం అధికంగా ఉంటోంది. అందులో పశ్చిమగోదావరి ఒకటి. అయితే ఉత్పత్తి కంపెనీలు మూత పడడంతో యూరియా సరఫరా తగ్గిపోయింది. దాంతో జిల్లాకు అవసరమైన యూరియా దిగుమతి కావడం లేదు. ఇదే ప్రస్తుతం కాస్త కలవరపాటుకు గురిచేస్తోంది.వ్యవసాయ శాఖ అప్రమత్తమై ముందుగానే చర్యలు తీసుకోవాలి. సొసైటీలు, డీలర్ల వద్ద అసరమైన యూరియాను సిద్ధంగా ఉంచాలి. లేదంటే అధిక ధరలతో పాటు, రైతులు యూరియాకు రోడ్డెక్కే పరిస్థితి ఏర్పడనుంది.


తాడేపల్లిగూడెం గొడౌన్‌లో స్టాకు పరిశీలిస్తున్న అధికారులు

పురుగు మందుల దుకాణాల తనిఖీ

తాడేపల్లిగూడెం రూరల్, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): విక్రయించే ప్రతీ అమ్మకానికీ బిల్లు ఉండాలి.లేకపోతే చర్యలు ఉంటాయని తణుకు ఏడీఏ నరేంద్ర హెచ్చరించారు.తాడేపల్లిగూడెంలో ఎరువులు, పురుగుమందుల దుకాణాలను తణుకు వ్యవసాయాధికారుల బృందం తనిఖీ చేసింది. తాడేపల్లిగూడెం, కడియద్ద, పెదతాడేపల్లిలోని ఎరువుల దుకాణాలు, సొసైటీలు, ప్రైవేటు గోదాములు సోమవారం తనిఖీ చేశారు. స్టాకు రిజిస్టర్లు పరిశీలించారు. ఎరువుల ధరలు వినియోగదారులకు తెలిసేలా డిస్‌ప్లే చేయాలని సూచించారు.


డ్వాక్రా మహిళలతో మాట్లాడుతున్న బ్యాంకు అధికారులు,ఎస్ఐ నాగరాజు

మా సొమ్ముల మాటేంటి ?

- బ్యాంకును ముట్టడించిన డ్వాక్రా మహిళలు
- జాతీయ రహదారిపై రాస్తారోకో

ఆకివీడు, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి) : బ్యాంకుకు కట్టాల్సిన సొమ్ము జమ చేయకుండా అవకతవకలకు పాల్పడిన రిసోర్స్ పర్సన్ (ఆర్పీ) వ్యవహారంపై డ్వాక్రా మహిళలు సోమవారం బ్యాంకును చుట్టుముట్టారు. దీంతో బ్యాంకు లావాదేవీలు నిలిచిపోయాయి. బ్రాంచి మేనేజర్ రమేష్‌ను నిలదీశారు. డబ్బులు చెల్లించినా ఇంకా లక్షల్లో కట్టాలంటూ బ్యాంకు నుంచి తమకు సమన్లు వచ్చాయంటూ మహిళలు ఆగ్రహించారు. బ్యాంకు ఎదురుగా జాతీయ రహదారిపై రాస్తారోకో చేశారు. కిలోమీటర్ల మేర ట్రాఫిక్ నిలిచిపో వడంతో పోలీసులు వచ్చి ట్రాఫిక్ క్లియర్ చేశారు. ఎస్ఐ హనుమంతు నాగరాజు డ్వాక్రా మహిళలతో మాట్లాడారు. బ్యాంకు మేనేజర్‌ను వివరాలు అడిగారు. ఆర్పీ సుధ ఆధీనంలో 36 గ్రూపులు వరకు ఉన్నాయన్నారు. డ్వాక్రా మహిళలకు చెందిన నగదు స్థానిక మెయిన్ ఎస్బీఐ ఖాతాదారు జలమూరి ఆదిలక్ష్మి అకౌంటుకు బదిలీ చేయించుకుందని తెలిపారు. దీంతో ఎస్ఐ ఆదిలక్ష్మిని పిలిపించి మేనేజర్ సమక్షంలో ప్రశ్నించారు. సుధకు అక్కా చెరువులు ఉన్నా యని ఒకేసారి నగదు డ్రాచేస్తే సమస్యలు తలెత్తుతాయని తన అకౌం టుకు వేయించినట్టు తెలిపింది. డ్వాక్రాకు సంబంధించిన పుస్తకాలు, స్టాంపులు అన్నీ మూడేళ్ల ఆమె దగ్గరే ఉన్నాయని లీడర్లు, సభ్యులు చెప్తున్నారని మేనేజర్ తెలిపారు. పుస్తకాలు, సంతకాలు, స్టాంపు ఆధారాలు ఉండడముతోనే నగదు బదిలీ చేసినట్టు మేనేజర్ చెబుతున్నారు. మెప్మా సీవో జయకృష్ణ, ఎస్ఐ నాగరాజు,బ్యాంకు అధికారులు న్యాయం చేస్తామని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు. యానిమేటర్ సుధ కనబడకపోవడంతో తల్లిదండ్రులను పోలీస్‌స్టేషన్‌కు తీసుకెళ్లారు. కేసు నమోదు చేస్తున్నట్టు ఎస్ఐ తెలిపారు.

- **కూలి పనులు చేసుకుంటూ కడుతున్నాం**





ఇళ్లల్లో పనిచేసుకుంటూ డ్వాక్రా కడుతున్నాం. ఇప్పుడు నాకు డబ్బులు వేయకుండా అసలు, వడ్డీ చెల్లించాలని అధికారులు చెపుతున్నారు. కూలిపని చేసుకుంటే గాని పూట గడవదు. కూలీ నాలీ చేసుకుంటూ నెల నెలా సొమ్ములు కడుతున్నాం.న్యాయం చేయకపోతే ఆత్మహత్యలే గతి.

- సందక లక్ష్మి, వంజరపు పద్మ, డ్వాక్రా సభ్యులు

టెట్- 25 పరీక్షకు ఏర్పాట్లు పూర్తి : జేసీ

భీమవరం రూరల్, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): ఏపీ టెట్ 2025 టీచర్స్ అర్హత పరీక్షల నిర్వహణకు కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేయాలని జిల్లా జాయింట్ కలెక్టర్ రాహుల్‌కుమార్ రెడ్డి అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో పరీక్షల నిర్వహణకు తీసుకోవలసిన చర్యలపై సంబంధిత శాఖల అధికారులతో ఆదివారం సమీక్షించారు. డిసెంబర్ 10వ తేదీ నుంచి 21 వరకు పరీక్షలు జరుగుతాయని, జిల్లాలో 8 పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు. భీమవరంలో విష్ణు ఉమెన్స్ ఇంజనీరింగ్ కాలేజీ, డీఎన్నార్ ఇంజనీరింగ్ , ఎస్ఆర్‌కేఆర్ ఇంజనీరింగ్ కాలేజీ, విష్ణు ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ, దంతులూరి నారాయణ రాజు కాలేజీ అటానమస్, నరసాపురంలో స్వర్ణాంధ్ర కాలేజీ,తాడేపల్లిగూడెంలో వాసవీ ఇంజనీరింగ్ కాలేజీ, శశి ఇంజనీరింగ్ కాలేజీలలో పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. మొదటి షిఫ్ట్ ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం 12.00 గంటల వరకు, రెండవ షిఫ్ట్ మధ్యాహ్నం 2.30 గంటల వరకు సాయంత్రం 5 వరకు పరీక్షలు జరగనున్నాయని తెలిపారు. జిల్లాలో 12,985 మంది అభ్యర్థులు హాజరుకానున్నట్లు తెలిపారు. పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలు చేయాలని సూచించారు. సమీపంలో ఎటువంటి జిరాక్స్ షాపులు నిర్వహించకుండా మూసివేయాలని ఆదేశించారు. 10వ తేదీ నుంచి 21 వరకు పరీక్ష కేంద్రాల వద్ద ఎటువంటి విద్యుత్ అంతరాయం లేకుండా చూడాలన్నారు. పరీక్ష కేంద్రాల వద్ద మెడికల్ సిబ్బందిని ఏర్పాటు చేయాలని వైద్య ఆరోగ్యశాఖ వారిని ఆదేశించారు. ఆయా రూట్లలో బస్సులు తిరిగేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

ఆది నుంచీ ఆయన తీరే అంత !

- నరసాపురం కమిషనర్ అంజయ్యపై కౌన్సిల్ గుర్రు
- సరెండర్ చేయాలంటూ కలెక్టరేట్‌లో వినతి

నరసాపురం టౌన్/భీమవరం టౌన్ డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): పుర పాలక సంఘం అన్ని విధాలుగా అభివృద్ధి చెందాలంటే కమిషనర్ పనితీరే కీలకం. అభివృద్ధి పనులు, పెండింగ్ సమస్యలు, అజెండా రూపొందించడంతో పాటు కిందిస్థాయి అధికారులతో సమన్వయంతో పని చేయించుకోవాలి. నరసాపురం కమిషనర్ అంజయ్య వ్యవహార శైలి దీనికి భిన్నంగా ఉండటంతో ఈ కమిషనర్ మాకొద్దంటూ చైర్‌పర్సన్ వెంకటరమణతో పాటు పలువురు కౌన్సిలర్లు శనివారం జరిగిన కౌన్సిల్ చేసిన సరెండర్ తీర్మానాన్ని సోమవారం జిల్లా కలెక్టర్‌కు అందించారు. నరసాపురం కమిషనర్‌గా అంజయ్య బాధ్యతలు చేపట్టి ఏడాది కావస్తున్నది. ఆదినుంచి కమిషనర్ వ్యవహార శైలిపై కౌన్సిల్‌తో కొందరు ప్రజా ప్రతినిధులు వ్యతిరేకత వ్యక్తం చేస్తున్నారు. కౌన్సిల్ ప్రతి పాదించిన పనులకు ముందుకు తీసుకెళ్లకపోవడం, సమస్యలపై పట్టనట్టు ఉండటం, అవినీతి ఆరోపణలు, స్వీపర్ల టెండర్ల వ్యవహారం వంటి విషయాల్లో ఆరోపణలు ఉన్నాయి. ఏడాదిలో 73 అభివృద్ధి పనులకు కౌన్సిల్ తీర్మానం చేసినా పట్టించుకోకపోవడం, ఫైల్స్‌పై సంతకాలు పెట్టకపోవడం వంటి కారణాల వల్ల ఆయనను సరెండర్ చేయాలని కౌన్సిల్ తీర్మానించింది. దానికి అనుగుణంగా జేసీను కలిసి తీర్మాన పత్రం అందించారు. వీసీ నాగిని, దుర్గాభవాని, సఖినేటిపల్లి సురేష్, పద్మ, కాంతమ్మ, శేషవేణి, గంగాభవాని, ఇందిర, కావలి రామసీత, యర్రా ఉమా, శ్యామల, శ్రీకాంత్ పాల్గొన్నారు.


జేసీకి వివరిస్తున్న నరసాపురం మునిసిపల్ కౌన్సిలర్లు

డబ్బులిస్తారా?

సస్పెండ్ చేయమంటారా ?!


ఏలూరు డీఈవో వెంకటలక్ష్మమ్మకు ఫిర్యాదు చేస్తున్న ఎంఈవోలు, హెచ్‌ఎంలు

- ఫుడ్ కమిషన్ సభ్యుడి పేరిట అపరిచితుడి హల్‌చల్
- భోజన పథకంలో అవకతవకలంటూ బెదిరింపులు
- పలువురు ఎంఈవోలు, హెడ్మాస్టర్లకు ఫోన్లు
- రూ.30 వేలు చేజార్చుకున్న ఓ హెచ్‌ఎం..డీఈవోకు ఫిర్యాదు

ఏలూరు అర్బన్, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): 'మీ స్కూలు, మండలంలో మధ్యాహ్న భోజన పథకంలో అవకతవకలు భారీగా జరు గుతున్నట్టు మా ఆఫీసుకు ఫిర్యాదులొచ్చాయి. కొందరు పేరెంట్స్ కంప్లైంట్స్ ఇచ్చారు. కొద్దిసేపట్లో మిమ్మల్ని సస్పెండ్ చేస్తున్నాం. దానిని ఆపాలంటే వెంటనే ఫోన్ పే నంబరుకు డబ్బులు (రూ.వేలల్లో) పంపించండి. లేకపోతే మీపై చర్యలు తీసుకోవాల్సిందిగా కలెక్టర్‌కు సిఫారసు చేస్తా. మీ గురించి పత్రికల్లో చెడుగా రాయిస్తా'అంటూ రాష్ట్ర ఆహార కమిషన్ మెంబరు పేరిట ఓ అపరితుడు ఏలూరు జిల్లాలోని పలువురు ఎంఈవోలు, ప్రధానోపా ధ్యాయులకు శని, సోమవారాల్లో ఫోన్లు చేసి బెదిరింపులు, హెచ్చరికలు చేయడం కలకలం రేపింది.దీనిపై సోమవారం సాయంత్రం ఏపీ ప్రధానోపాధ్యాయుల సంఘం జిల్లా నాయకత్వం రంగంలోకి దిగింది. బెదిరింపులు, దుర్భాషలు, డబ్బుల కోసం డిమాండ్ చేసిన వ్యక్తి వివరాలను ఫోన్‌నంబరు సహా డీఈవో వెంకట లక్ష్మమ్మకు ఫిర్యాదు చేసింది. తొలుత ఫిర్యాదును మంగళవారం భీమడోలు సీఐకు ఇవ్వాలని, అదే ఫిర్యాదును తాను ఎస్పీకి పంపిస్తానని డీఈవో చెప్పడంతో హెచ్‌ఎంల సంఘం నాయకులు వెనుదిరిగారు.

భీమడోలు టీచర్లకు ఫోన్లు

భీమడోలు జడ్పీ హైస్కూలు హెచ్‌ఎం జి.ఎస్.పద్మజకు శనివారం ఓ అపరిచిత నంబరు నుంచి ఫోన్‌కాల్ వచ్చింది. స్టేట్ ఫుడ్ కమిషన్ కార్యాలయం(విజయవాడ) నుంచి ఫోన్ చేస్తున్నానంటూ, తాను స్టేట్ ఫుడ్ కమిషన్ మెంబరు నారాయణనంటూ మాట్లాడాడు. స్కూలులో మధ్యాహ్న భోజన పథకం బియ్యం, కోడిగుడ్లు, చిక్కీల విషయంలో ప్రభు త్వం పంపిణీ చేసిన పరిమాణానికి తగిన విధంగా వినియోగంలో లెక్కలు సరిపోలడం లేదని, ఆ మేరకు అవకతవకలు జరుగుతున్నట్టుగా తమ కార్యాలయానికి ఫిర్యాదులు రావడంతో పాటు విద్యార్థుల తల్లిదండ్రులు విజయవాడలోని స్టేట్ ఫుడ్ కమిషన్ ఆఫీసుకు వచ్చి మీపై ఫిర్యాదు చేశారని గట్టి స్వరంతో బెదిరింపులకు దిగాడు. ఫిర్యాదుపై చర్యలు తీసుకోకుండా ఉండేందుకు వెంటనే డబ్బులు ఫోన్ పే ద్వారా పంపాలంటూ శనివారం బెదిరించడంతో హెచ్‌ఎం తొలుత రూ.5 వేలు, తదుపరి మరో రూ.25 వేలు ట్రాన్స్‌ఫర్ చేశారు. అంతకుముందు భీమడోలు ఎంఈవోకు ఇదే వ్యక్తి ఫోన్‌చేసి మీరు మండలంలో ఎనిమిదేళ్లుగా పనిచేస్తున్నా సరిగా విధులు నిర్వర్తించడం లేదని, తమ వద్దకు వచ్చిన పేరెంట్స్‌తో కలెక్టర్‌కు, మానవ హక్కుల సంఘానికి ఫిర్యాదు చేయించి సస్పెండ్ చేయిస్తానని బెదిరింపులకు పాల్పడ్డాడు. మండలంలోని పాఠశాలల హెచ్‌ఎంల ఫోన్ నంబర్ల జాబితాను పంపాలని ఆదేశించడంతో ఎంఈవో పంపించారు. ఈ ఫోన్ నంబర్ల ఆధారంగానే హెచ్‌ఎం పద్మజను ఆ వ్యక్తి బెదిరించి ఫోన్ పేకు డబ్బులు వేయించుకున్నాడు. సోమవారం ఏలూరు, పెదపాడు, జీలుగుమిల్లి, తదితర ఎంఈవోలకు ఫోన్ చేసి మండలంలోని హెచ్‌ఎంల ఫోన్ నంబర్లను అడగడంతో పాటు, పలువురు హెచ్‌ఎంలకు ఫోన్ చేసి మధ్యాహ్న భోజన పథకంలో అవకతవక లంటూ డబ్బులకు డిమాండ్ చేశాడు. ఫోన్ చేసిన వ్యక్తి సంభాషణలను అనుమానించిన పెదపాడు ఎంఈవో-2 ఎస్.నరసింహమూర్తి ప్రశ్నించడంతో ఫోన్ స్విచ్ఛాఫ్ చేశాడు. ఆ వెంటనే విజయవాడలోని స్టేట్ ఫుడ్ కమిషన్ చైర్మన్ వ్యక్తిగత కార్యదర్శి శ్రీనివాసన్‌కు పెదపాడు ఎంఈవో ఫోన్‌చేసి అపరిచిత వ్యక్తి గురించి వివరాలు చెప్పడంతో తమ కార్యాలయంలో ఆ పేరు గల అధికారి లేరని చెప్పడంతో వెంటనే మండలంలోని హెచ్‌ఎంల వాట్సాప్ గ్రూపులో ఫేక్ ఆఫీసర్ సమాచారాన్ని పోస్టు చేశారు. ఎవరూ డబ్బులివ్వవద్దని హెచ్చరించారు.

క్రాస్ కంట్రీ జట్ల ఎంపిక



క్రాస్‌కంటీకి ఎంపికైన పశ్చిమ గోదావరి జిల్లా జట్టు

తణుకు, డిసెంబరు (ఆంధ్రజ్యోతి): జిల్లా అండర్-16,18,20 మహిళలు, పురుషుల క్రాస్ కంట్రీ (రోడ్ రన్) జట్ల ఎంపికలు సోమవారం నిర్వహించారు. ఎంపికలు జిల్లా అసోసియేషన్ ఆధ్వర్యంలో డిమార్ట్ వద్ద జరిగినట్లు అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి సంకు సూర్యనారాయణ చెప్పారు. పోటీలకు జిల్లా నలుమూలలు నుంచి 200మంది క్రీడాకారులు హాజరైనట్లు తెలిపారు. వారిలో 22మందిని ఎంపిక చేశామన్నారు. ఎంపికైన జట్లు ఈనెల 24న పెద్దాపురంలో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారని వివరించారు. పోటీలను సంఘ అధ్యక్షుడు చింతకాయల సత్యనారాయణ ప్రారంభించారు. కార్యక్రమంలో అసోసియేషన్ కోశాధికారి కె.బాబురావు, వ్యాయామ ఉపాధ్యాయురాలు కె. ఈశ్వరి పాల్గొన్నారు.

పారా అథ్లెటిక్స్‌లో రామకృష్ణ ప్రతిభ



పతకాలు సాధించిన విద్యార్థి రామకృష్ణకు అభినందన

పాలకోడేరు, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 6వ తేదీన భీమవరంలో నిర్వహించిన జిల్లా స్థాయి పారా అథ్లెటిక్స్ పోటీల్లో పాలకోడేరు మండలం మోగల్లు ఏఎస్ఆర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థి కె. రామకృష్ణ మూడు బంగారు పతకాలు సాధించినట్లు ఆ పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయుడు కె.సూర్య తెలిపారు. 100 మీటర్ల రన్నింగ్ రేస్, షాట్‌పుట్, డిస్కస్ త్రో పోటీల్లో పతకాలు సాధించాడని తెలిపారు. విద్యార్థిని సర్పంచ్ మల్లిపూడి కృష్ణకుమారి శ్రీనివాస్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు త్రినాథ్ తదితరులు అభినందించారు.

పరీక్షా పే చర్చకు రిజిస్ట్రేషన్లు ప్రారంభం

ఏలూరు అర్బన్, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): ప్రధానమంత్రి నరేంద్రమోదీతో నిర్వహించే ప్రత్యేక కార్యక్రమం పరీక్షా పే చర్చ-2026 (పీపీసీ)కి రిజిస్ట్రేషన్ల ప్రక్రియ ప్రారంభమైందని, ఇది జనవరి 11వ తేదీ వరకు జరుగుతుందని ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా కో-ఆర్డినేటర్, దూబచర్ల డైట్ కేంద్రం ప్రిన్సిపాల్ ఎం.కమలకుమారి ఓ ప్రకటనలో తెలిపారు. ఏలూరుజిల్లా డీఈవో నోడల్ ఆఫీసర్‌గా వ్యవహరిస్తారని వివరించారు. పీపీసీ-2026 పోర్టల్‌ద్వారా అన్ని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల విద్యార్థులు, వారి తల్లితండ్రులు, ఉపాధ్యాయులు ఇందులో పాల్గొనవచ్చునన్నారు. ప్రధానమంత్రిని నేరుగా కలుసుకునే అవకాశానికి ఈ పోర్టల్‌లో తప్పనిసరిగా రిజిస్ట్రేషన్ చేయించుకోవాల్సి ఉంటుందని వివరించారు. రిజిస్ట్రేషన్ల ప్రక్రియను వేగవంతంచేసేందుకు, మరిన్ని వివరాల కోసం సంప్రదించేందుకు ఉమ్మడి జిల్లాలోని రెండు జిల్లాలకు వేర్వేరుగా డైట్ లెక్చరర్లను నియమించామని తెలిపారు. అన్ని మండలాల్లో రిజిస్ట్రేషన్లు వేగవంతమయ్యేందుకు వీరు పర్యవేక్షిస్తారన్నారు.

పర్యవేక్షకుల వివరాలివే..

ఏలూరుజిల్లాకు సంబంధించి వై.స్వరాజ్య శ్రీనివాస్ (ఫోన్ నంబరు 73821 81182), సీహెచ్.గోవిందరాజులు (86399 31818), శామ్యూల్ సంజీవ్(99123 08303). పశ్చిమగోదావరిజిల్లాకు సంబంధించి ఎం.విజయప్రసన్న (99492 62953), బి.జాన్సన్ (70137 81688)లను పీపీసీ-2026 రిజిస్ట్రేషన్ల ప్రక్రియ సమాచారం నిమిత్తం సలహాలిచ్చేందుకు పర్యవేక్షకులుగా నియమించినట్టు డైట్ ప్రిన్సిపాల్ వివరించారు. రిజిస్ట్రేషన్లకు ఇన్నోవేటివ్‌ఇండియా1.మైగవ్.ఐఎన్ వెబ్‌సైట్‌ను సందర్శించాలని కోరారు.

ఈవోపై పీజీఆర్ఎస్‌లో ఫిర్యాదు

జంగారెడ్డిగూడెం/ఏలూరు రూరల్, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): గోకుల పారిజాతగిరి వేంకటేశ్వరస్వామి దేవస్థానం ఈవో కలగర శ్రీనివాస్ అక్రమ పద్ధతిలో పదోన్నతి పొంది ఈవోగా విధులు నిర్వహిస్తున్నారని పట్టణానికి చెందిన అన్నంరెడ్డి గోపాలరావు సోమవారం ఏలూరులో జరిగిన పీజీఆర్ఎస్‌లో జాయింట్ కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. దేవస్థానం సొమ్ము దుర్వినియోగం చేశారని, విచారణ చేసి చర్యలు తీసుకోవాలని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ మేరకు ఆయన చేసిన వీడియో సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. ఈ విషయంపై గోకుల పారిజాతగిరి ఈవో కలగర శ్రీనివాసు మాట్లాడుతూ అవన్నీ అసత్య ఆరోపణలని కొట్టిపారేశారు. ఇటీవల స్థానిక శ్రీ సీతారామ స్వామి దేవస్థానానికి చెందిన 34 ఎకరాల పామాయిల్ తోటను స్వాధీనం చేసుకున్నామని, అందులో పది ఎకరాలను ఆక్రమించుకున్న ఆక్రమణదారుడైన అన్నంరెడ్డి గోపాలరావు తనపై అసత్య ఆరోపణలు చేస్తున్నారన్నారు. గోపాలరావు దేవస్థానానికి సుమారు రూ.6 లక్షలు బకాయి పడడంతో అతని ఆస్తులు అటాచ్ చేయడానికి చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. అక్రమంగా అనుభవిస్తున్న దేవస్థాన భూమిని దేవదాయ శాఖ తరుపున స్వాధీనం చేసుకున్నందుకే తనపై అక్కసుతో ఇలా లేని ఆరోపణలు, ఫిర్యాదులు చేస్తున్నట్లు తెలిపారు.

‘శంబాల ఏ ఒక్కరినీ నిరాశపర్చదు’



విలేకరులతో మాట్లాడుతున్న హీరో ఆది

భీమవరం టౌన్, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): శంబాల చిత్రం ఏ ఒక్కరినీ నిరాశపర్చదని, అందరినీ ఆకట్టుకునేలా ఉంటుందని, ఈనెల 25న ఈ చిత్రం విడుదల అవుతుందని హీరో ఆది సాయి కుమార్ అన్నారు. శంబాల చిత్ర ప్రమోషన్స్‌లో భాగంగా సోమవారం భీమవరంలో సందడి చేశారు. ముందుగా మావుళ్ళమ్మ అమ్మవారిని హీరో ఆది, హీరోయిన్ అర్చన అయ్యర్, నటులు ఇంద్రనీల్ దర్శించుకున్నారు. అనంతరం జరిగిన విలేకరుల సమావేశంలో హీరో ఆది మాట్లాడుతూ కంటెంట్ బాగుంటేనే జనాలు థియేటర్‌లకు వస్తున్నారని, అలాంటి డిఫరెంట్ కంటెంట్‌తో మీ ముందుకు వస్తున్నామని అన్నారు. అన్నీ అద్భుతంగా ఉంటాయని, ఎక్కడా కాంప్రమైజ్ కాకుండా ఈ మూవీని రూపొందించారన్నారు. 1980 నాటి పల్లెటూరి వాతావరణంలో ఈ కథ కొనసాగుతుందని, మూఢనమ్మకాలతో నిండిన ఆ గ్రామంలో జరిగే అతీంద్రియ పరిణామాలు ప్రేక్షకులకు ఆసక్తి కలిగించేలా ఉంటాయన్నారు. భౌగోళిక శాస్త్రవేత్తగా ఓ ఛాలెంజింగ్ రోల్‌లో నటిస్తున్నానని, ఈ చిత్రంలో రెండు పాటలు ఉన్నాయని అన్నారు. ఈ సినిమా మొత్తం ఉత్కంఠంగా సాగుతుందని, ఈనెల 25న క్రిస్మస్ సందర్భంగా విడుదల అవుతుందన్నారు. బాలకృష్ణ నటిస్తున్న అఖండ-2 కూడా అదే రోజు వస్తుందేమో అని మాలో కంగారు కూడా ఉందని అన్నారు. హీరోయిన్ అర్చన మాట్లాడుతూ శంబాల లాంటి అద్భుతమైన చిత్రంలో మంచి పాత్రను పోషించడం ఆనందంగా ఉందని అన్నారు. ఇంద్రనీల్ మాట్లాడుతూ శంబాల నాకు కమ్ బ్యాక్ మూవీ అవుతుందని, అందరూ ఎంజాయ్ చేసేలా ఈ సినిమా ఉంటుందన్నారు. కొత్తపల్లి నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణానికి ప్రమాదం



రైతులకు అవగాహన కల్పించాలంటున్న శాస్త్రవేత్తలు

నిప్పుతో వరి చేనుకు ముప్పు

గణపవరం, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): వరి చేనుకు నిప్పు పెడితే పంటకు ముప్పు తప్పదని వ్యవసాయ శాస్త్రవేత్తలు తీవ్రంగా హెచ్చరిస్తున్నారు. వరిచేలల్లో ఎండుగడ్డిని కాల్చటం వలన తీవ్ర అనర్థాలు సంభవిస్తాయని అధికారులు అంటున్నారు. వరికోత యంత్రాలతో కోత కోసిన అనంతరం పొలంలో మిగిలిన గడ్డిమొక్కలు తొలగించడానికి కూలీలకు ఖర్చులు అధికం కావడంతో రైతులు గడ్డిని పొలంలో కాల్చడానికి మొగ్గు చూపుతున్నారు. గడ్డిని చేలల్లో తగులబెట్టడం వలన సేంద్రియాలు తగ్గిపోతాయని, కాలుష్యం పెరిగి, భూసారం తగ్గుతుందన్నారు. దీని వలన రాబోయే దాళ్వాపంటలో రైతులకు ఎకరానికి రూ.2వేలు నుంచి 2500 వరకు ఖర్చవుతుందని చెబుతున్నారు. దీంతో పాటు పరిసర ప్రాంత ప్రజలకు ఊపిరితిత్తుల వ్యాధుల, అలర్జీలు వచ్చే ప్రమాదాలు ఉన్నాయని హెచ్చరిస్తున్నారు. గడ్డిని కాల్చడం వలన పోటాష్, యూరియా, భాస్వరం వంటి వాటిని తిరిగి పొందటానికి అధికంగా రైతులు ఎరువుల వాడాల్సి ఉంటుందన్నారు. రైతులకు దీనిపై అవగాహన లేక తమ చేలకు నిప్పుపెడుతున్నారని అన్నారు.

భూమిలో పోషకాలు నశిస్తాయి



ఆర్ఎస్.ప్రసాద్, మండల వ్యవసాయాధికారి, గణపవరం

వరిచేలకు నిప్పు పెట్టడం వలన భూమిలో ఉండే పోషకాలు పూర్తిగా నసిస్తాయి. వరికోతల అనంతరం చేలలో మిగిలిన గడ్డిని పలుచుగా చేనంతా చల్లాలి. అలా చల్లిన గడ్డిపై ఎకరానికి నాలుగు బస్తాల సూపర్‌పాస్పేట్, అరబస్తా యూరియా కలిపి చల్లాలి. తరువాత దమ్ము చేస్తే గడ్డి త్వరగా కుళ్లుతుంది. గడ్డి తగలబెట్టడం వలన చేలల్లో సేంద్రీయ కార్బన్ తగ్గిపోవడంతో పాటు, భూమిపొరల్లో ఉండే పోషకాల లభ్యత తగ్గిపోతుంది. భూమిపొరల్లో ఉండే మొక్కలకు మేలు చేసే సూక్ష్మజీవులకు నష్టం వాటిల్లుతుంది. గడ్డి తగలబెట్టడం వలన కార్బన్‌డైయాక్సైడ్, కార్బన్‌మోనాక్సైడ్, నైట్రేట్, ఆక్సైట్, ఎక్కువగా విడుదలై వాతావరణంలో విలీనమై పర్యావరణం దెబ్బతింటుంది. గడ్డి తగలబెట్టిన గడ్డిద్వారా వచ్చే పొగవలన జంతువులకు, పశువులకు ప్రాణహాని, ఆస్మావచ్చే ప్రమాదం ఉంది.



కొమ్మరలో రోడ్డు పక్కన ప్లాస్టిక్ వ్యర్థాలు

ప్లాస్టిక్ భూతం

అత్తిలి, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): పర్యావరణానికి ముప్పుగా పరిణమించిన ప్లాస్టిక్ నిర్మూలనపై యంత్రాంగం శీతకన్ను వేస్తోంది. దీంతో రహదారులు పక్కన కుప్పలుగా పేరుకుపోతోంది. తగరపు సంచులను ప్రభుత్వం నిషేధించినా అమలైనా దాఖలాలు కన్పించడం లేదు. అధికారులు ఉదాసీనంగా వ్యవహరిస్తుండడంతో పంచాయతీల్లో అమలు కావడంలేదు.

అన్ని చోట్లా ప్లాస్టిక్ కవర్ల వినియోగం

గ్రామాలు, పట్టణాల్లో హోటళ్ళు, టిఫిన్ సెంటర్లు, కూరగాయలు, చేపలు, మాంసం దుకాణాలు, చిల్లర దుకాణాలు, తోపుడు బండ్ల వ్యాపారులు ప్లాస్టిక్ కవర్లు విక్రయిస్తున్నారు. వాడినవి ఎక్కడపడితే అక్కడ దర్శనిమివ్వడం ఆందోళన కల్గిస్తుంది.

అక్కడ అలా.. ఇక్కడ ఇలా!

ట్రాక్టర్ ఎండు గడ్డి ధర మెట్టలో రూ.10 వేలు.. డెల్టాలో రూ.6,500 రూ. 4 వేలు

ఎండు గడ్డి ధరలు ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో ఒకే విధంగా లేవు. మెట్టలో ధరలు ఆకాశాన్నంటుతుండగా డెల్టాలో మాత్రం బాగా తగ్గాయి. మెట్టలో వాణిజ్య పంటలకు ఎక్కువగా రైతులు ప్రాధాన్యం ఇస్తుండటంతో అక్కడ వరి పంట తక్కువగా ఉంటుంది. దీనితో ఎండు గడ్డికి డిమాండ్ ఏర్పడింది. డెల్టాలో సహజంగా నీటి వనరులు ఎక్కువగా ఉండటం వల్ల వరి పంటకు అనుకూలంగా ఉన్నది. ఈ పరిస్థితుల్లో మెట్టలో ఎండు గడ్డికి డిమాండ్ ఏర్పడింది.



దూరాన్ని బట్టి గడ్డి ధర పెరుగుదల

బుట్టాయగూడెం, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి):పశ్చిమ ఏజెన్సీ, మెట్ట ప్రాంతాల్లో ఎండుగడ్డికి డిమాండ్ ఏర్పడింది. నిత్యం పదుల సంఖ్యలో ఎండుగడ్డి ట్రాక్టర్లు ఏజెన్సీ మెట్ట ప్రాంతాలకు తరలివ స్తున్నాయి. దూరాన్ని బట్టి ట్రాక్టరు గడ్డిని రూ.8 వేల నుంచి 10 లేదా 12 వేలకు విక్రయిస్తున్నారు. విడిగా ఉన్న గడ్డికి ఒక రేటు, కట్టలు కట్టిన గడ్డికి మరొక రేటుతో గడ్డి యాజమానులు అమ్మకాలు జరుపుతున్నారు. విడిగా ఉన్న ఎకరంలోని గడ్డి ట్రాక్టరులో లోడు చేసి 8వేల నుంచి 10 వేల వరకు దూరాన్ని బట్టి అమ్ముతుండగా కట్టలు కట్టిన గడ్డిని ఎకరాకు 60 నుంచి 70 కట్టలు కట్టి దూరాన్ని బట్టి 140 రూపాయలు పైనే ఒక్కో కట్టను అమ్ముతున్నారు. జలాశయాల కింద వరిపంటను సాగుచేసిన రైతుల నుంచి వ్యాపారులు ఎకరాల చొప్పున కొనుగోలు చేసి ఏజెన్సీ, మెట్ట ప్రాంతాలకు తరలిస్తూ అమ్మకాలు జరుపుతున్నారు.

వాణిజ్య పంటలపైనే ఆసక్తి

ఏజెన్సీ, మెట్ట ప్రాంతాల్లో వాణిజ్య పంటలైన వర్జీనీయా పొగాకు, మొక్కజొన్న, ప్రత్తి ఇతర పంటలపై మోజు పెంచుకున్న రైతులు వరిపంటను సాగుచేయడం అరుదనే చెప్పాలి. బోర్ల కింద మహా అయితే 500 నుంచి 1500 ఎకరాలకు వరిపంట మించదు. అందుకే ఏజెన్సీలో ఎండుగడ్డికి ఎక్కడాలేని డిమాండ్ ఉంటుంది. దీనిని దృష్టిలో పెట్టుకుని జలాశయాలు, పంటకాల్వల కింద వరిని సాగుచేసిన రైతులు కోతలు అనంతరం గడ్డిని ఏజెన్సీకి తరలిస్తుండగా ఇక్కడి పశువుల యజమానులు గడ్డి దొరికే సమయంలో కొనుగోలు చేసి ముందుగానే జాగ్రత్త చేస్తారు. ప్రతిఏటా వందల సంఖ్యలో ఎండుగడ్డి ట్రాక్టర్లు ఏజెన్సీ, మెట్ట ప్రాంతాల్లో దర్శనమిస్తుంటాయి. ఎండుగడ్డి వ్యాపారంలో దళారుల పాత్రను కొట్టిపారేయలేము. అప్పుడప్పుడు కృత్రిమ కొరతను సృష్టిస్తూ సొమ్ములు చేసుకుంటారు. ఇప్పటికే వందల ట్రాక్టర్లు ద్వారా ఎండుగడ్డి ఏజెన్సీ, మెట్ట ప్రాంతాలకు చేరుకున్నది.

తగ్గిన గడ్డి ధర

భీమవరం రూరల్, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): సార్వా పంట మాసూళ్లతో వాతావరణం అనుకూలం. ఎండగడ్డి మాసూళ్ళకు వీలుగా మారింది. దీంతో ఎండుగడ్డి సరసమైన ధరకు దొరుకుతున్నది. గతంలోకంటే ట్రాక్టర్ గడ్డి రూ. 4 వేలు తక్కువగానే అందుబాటులో ఉంటున్నది. గత ఏడాది సార్వా పంటలో పంట సాగు తక్కువ సాగడం మాసూళ్ళ సమయంలో వర్షాలు పడి గడ్డి పాడయ్యింది. దీంతో అప్పట్లో ట్రాక్టర్ గడ్డి రూ. 10 వేల పైగా ధర పలికింది. ఇప్పుడు ట్రాక్టర్ గడ్డి రూ. 6500లకు అమ్మకాలు చేసుకున్నారు. సార్వా గడ్డిపైనే రైతులు ఎక్కువ మక్కువ చూపుతారు. పురుగు మందుల వాడకం తక్కువ ఉంటుంది. అందువల్ల పశువులకు ఎక్కువ గడ్డి నిల్వ చేసుకోవడానికి ప్రయత్నిస్తారు. ఈసారి కావలసిన గడ్డి సరిపడ ధరకు అందుబాటులో వస్తుంది. వారం రోజులుగా ఎండుగడ్డి నిల్వలు అన్ని ప్రాంతాల్లో చేస్తున్నారు.

3 లక్షల 65 వేల టన్నులు గడ్డి అవసరం

పశువు ఒకటి రోజుకి 5 కేజీల ఎండుగడ్డి తింటుంది. దాని ప్రకారం జిల్లాలోని 2 లక్షల 36 వేల పశువులకు 3 లక్షల 65 టన్నులు గడ్డి అవసరం ఉంటుంది. ఈ సార్వా పంటలో రెండు లక్షల పైగా టన్నుల గడ్డిని భద్రపరచడానికి రైతులు ప్రయత్నాలు చేస్తున్నారు. ఈ ఏడాది సార్వా సాగు 2 లక్షల 17 వేల ఎకరాలలో సాగింది. వాతావరణం అనుకూలం కారణంగా పంటచేలు బాగా తయారయ్యాయి. ఎండుగడ్డి బాగానే వస్తుంది. దీంతో ఆయా ప్రాంతాల్లోని రైతులు గడ్డిని గట్లకు చేర్చుకుని మోడులుగా చేస్తున్నారు.

గడ్డి మాసూళ్ళలో సులువు విధానం

ఎండుగడ్డి మాసూళ్ళకు సులువు విధానం అందుబాటులోకి వచ్చింది. వరికోత యంత్రం మాసూళ్ళ చేసిన చేలలో ఎండుగడ్డి మాసూళ్ళ యాంత్రిక పనిముట్లతో చేస్తున్నారు. ట్రాక్టర్‌కు ఎటాచ్ చేసి ఉంటే పనిముట్లు గడ్డిని నాటుతూ మోపుగా చుడుతుంది. అలా చుట్టినందున రూ. 30 వసూలు చేస్తున్నారు. రైతుకు కూలీలు అవసరం లేకుండానే ఎండుగడ్డి మోపులుగా మారుతుంది. ఇప్పుడు అలానే ఎక్కువ మాసూళ్ళ చేస్తున్నారు.

బ్రహ్మ కమలాలు కనువిందు

ఒకే చెట్టుకు 128 పుష్పాలు

పూలను ఆలయాలకు పంపుతున్న దంపతులు



జంగారెడ్డిగూడెంలో విరబూసిన బ్రహ్మ కమలాలు

జంగారెడ్డిగూడెం, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): అరుదుగా కనిపించే బ్రహ్మపుష్పాలు జంగారెడ్డిగూడెం పట్టణానికి చెందిన కరుటూరి వెంకట సుబ్బారావు, సుజాత ఇంటి వద్ద కనువిందు చేస్తున్నాయి. హిందూ సాంప్రదాయంలో ప్రత్యేక స్థానం ఉన్న ఈ బ్రహ్మ కమలాలు హిమాలయాల్లో మాత్రమే లభిస్తాయి. భక్తిభావం కలిగిన వారు, మొక్కలపై ప్రత్యేక శ్రద్ధ కనబరిచే వారు మాత్రమే ఇటువంటి అరుదైన పుష్పాలను పెంచుతారు.

అర్ధరాత్రి మాత్రమే పూస్తాయి

ఐదేళ్ల క్రితం తన సోదరుడితో హిమాచల్‌ప్రదేశ్ నుంచి చిన్న బ్రహ్మకమలం, పెద్ద బ్రహ్మ కమలం మొక్కలు తెప్పించానని, తన భార్య సుజాత ఎంతో ఇష్టంగా పెంచుతున్నట్లు సుబ్బారావు తెలిపారు. ప్రతి సం వత్సరం పది,పదిహేను కమలాలు మాత్ర మే పూస్తాయని, ఈ సంవత్సరం మాత్రమే డిసెంబరు 7వ తేదీ ఆదివారం రాత్రి పదిన్నరకు ఒక చెట్టుకు ఏకంగా 128 బ్రహ్మ కమలాలు పూశాయని తెలిపారు. కమలాలు విరిసిన తరువాత అదే రోజు తెల్లవారు జామున మూడున్నర గంటల వరకే ఉంటాయని తరువాత కనిపించవని తెలిపారు. గతంలో పట్టణంలో ఉన్న గంగానమ్మ,ముత్యాలమ్మ అమ్మవార్ల ఆలయాలలో పూజల కోసం అనేకసార్లు పంపించినట్లు తెలిపారు. స్వామి వారి అష్టోత్తర పూజకు పరిపడా ఒకే చెట్టుకు పూయాలని తాను ప్రార్థించగా వెంకటేశ్వరస్వామి మహిమ వల్లనే 128 బ్రహ్మ కమలాలు పూశాయని సుజాత సంతోషం వ్యక్తం చేశారు.

ఈ 108 బ్రహ్మకమలాలతో గోకుల పారిజా తగిరి వెంకటేశ్వర స్వామికి సోమవారం నాడు అష్టోత్తర శతనామార్చన, ప్రత్యేక పూజలు నిర్వహించారు. అరుదైన బ్రహ్మ కమలా లను స్వామివారికి అర్పించడం సంతోషంగా ఉందని సుబ్బారావు, సుజాత దంపతులు ఆనందం వ్యక్తం చేశారు.



డీఎస్పీ శ్రీవేదకు వినతిపత్రం అందిస్తున్న చైర్‌పర్సన్ వెంకటరమణ, కౌన్సిలర్లు

కౌన్సిలర్ల నిర్బంధంపై ఫిర్యాదు

నరసాపురం టౌన్, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): కౌన్సిల్ సమావేశాన్ని పూర్తి చేసుకుని బయటకు వస్తుంటే... చైర్‌పర్సన్‌తో పాటు మిగిలిన కౌన్సిలర్లను బయటకు వెళ్లనివ్వకుండా కార్యాలయ గేట్‌కు మాజీ కౌన్సిలర్ గోరు సత్తిబాబు తాళం వేసి నిర్బంధించాంటూ సోమవారం డీఎస్పీ శ్రీవేదకు చైర్‌పర్సన్ వెంకటరమణ కౌన్సిలర్లతో కలిసి వినతిపత్రం అందించారు. పెట్రోల్ పోసి ఇక్కడే దహనం చేస్తామని బెదిరించారన్నారు. వైసీపీ కౌన్సిలర్ జయరాజు మరికొంత మంది సహకారంతో గేట్ తాళాలు పగలగొట్టి బయటకు తీసుకొచ్చారంటూ డీఎస్పీకి విన్నవించారు. కౌన్సిలర్లను నిర్బంధించిన సత్తిబాబుపై విచారించి చర్యలు తీసుకోవాలని విన్నవించారు. ఈకార్యక్రమంలో వీసీ కామన నాగిని, శ్యామల, పద్మ, దుర్గాభవాని, కాంతమ్మ, సఖినేటిపల్లి సురేష్, శ్రీకాంత్, కామన బుజ్జీ పాల్గొన్నారు.



జేసీకి వినతి పత్రం అందిస్తున్న జేఏసీ నాయకులు

జిల్లా కేంద్రంగా నరసాపురాన్ని ప్రకటించండి

భీమవరం టౌన్/నరసాపురం టౌన్, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రాన్ని నరసాపురం చెయ్యాలని నరసాపురానికి చెందిన పలు సంస్థల ప్రతినిధులు పీజీఆర్ఎస్‌లో జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డికి సోమవారం వినతి ప్రతం అందించారు. ప్రదర్శనగా వచ్చిన ప్రతినిధులు ఆయనతో మాట్లాడారు. జిల్లాల పునర్విభజనలో తమకు అన్యాయం జరిగిందని వివరించారు. పార్లమెంట్ నియోజకవర్గాన్ని జిల్లా కేంద్రంగా పరిగణలోకి తీసుకుని నరసాపురాన్ని జిల్లా కేంద్రంగా మార్పు చెయ్యాలని వారు కోరారు. తొలుత నరసాపురంలో లయన్స్‌క్లబ్ భవనం వద్ద సమావేశమైన జేఏసీ నాయకులు అక్కడి నుంచి కార్లలో ర్యాలీగా బయలుదేరివెళ్లారు. గాంధీ, అంబేడ్కర్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో డాక్టర్ చినమిల్లి సత్యనారాయణ, చెన్నా రమేష్, కూనపరెడ్డి రంగారావు, అత్మూరి వెంకట నరసయ్య, దొండపాటి స్వామి, మునికోటి వెంకటేశ్వరావు, ఆరేటి మృత్యుంజయ, అధికారి ఏసు, వనమాల శ్రీనివాసరావు, పిండి ఆదినారాయణ పాల్గొన్నారు.

క్రిప్టో కరెన్సీ సంస్థలపై చర్యలేమిటి?

పార్లమెంట్‌లో ఎంపీ మహేశ్ ప్రశ్న



ఏలూరు టూటౌన్, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): ఏలూరు ఎంపీ మహేశ్ కుమార్ పార్లమెంట్‌లో పలు అంశాలను లేవనెత్తారు. మంత్రులను అడిగి సమాధానాలు రాబట్టారు. ఇందులో ముఖ్యమైన వాటిని పరిశీలిస్తే క్రిప్టో కరెన్సీ ఒకటి. కొన్ని క్రిప్టో కరెన్సీ సంస్థలపై అనేక ఆరోపణలు వస్తున్నాయని తెలిపారు. ఇలాంటి సంస్థలను ఎలా నియంత్రణ చేస్తున్నారు? ఆదాయపు పన్ను చట్టం కింద నిబంధనలు పాటించని క్రిప్టో కరెన్సీ సంస్థలపై ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారని ఎంపీ మహేశ్ కుమార్ ప్రశ్నించారు. మహేశ్ ప్రశ్నకు కేంద్రమంత్రి చౌదరి సమాధానం ఇస్తూ మనీలాండరింగ్ కార్యకలాపాలు, ఉగ్రవాదానికి నిధులు సమకూర్చే సంస్థల నియంత్రణకు ఫైనాన్షియల్ ఇంటెలిజెన్స్ యూనిట్ నేతృత్వంలో వర్చువల్ అసెట్స్ సర్వీస్ ప్రొవైడర్లను రిజిస్ట్రేషన్ చేస్తున్నట్లు తెలిపారు. నిబంధనలు పాటించని రూ.40కోట్ల విలువైన లావాదేవిలు, రూ.125 కోట్ల లెక్కలు చూపని ఆదాయం బయటపడిందన్నారు. గత మూడేళ్లలో రూ.888.82 కోట్ల లెక్కలు చూపని ఆదాయం బయటపడిందన్నారు. వారిపై చర్యలు తీసుకుంటామన్నారు.

కాన్వెక్స్ మిర్రర్‌తో ప్రమాదాల నివారణ

పెదవేగిలో ఐదుచోట్ల ఏర్పాటు



కాన్వెక్స్ మిర్రర్‌తో పోలీస్ కానిస్టేబుల్

పెదవేగి, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): మలుపుల్లో తరచుగా ప్రమాదాలు జరిగే ప్రాంతాల్లో ప్రమాదాల నివారణకు కాన్వెక్స్ మిర్రర్‌లు దోహదపడతాయని పెదవేగి ఎస్ఐ కె.రామకృష్ణ అన్నారు. దీనికోసం గుర్తించిన ఐదుచోట్ల కాన్వెక్స్ మిర్రర్‌లను ఏర్పాటు చేశామని ఆయన చెప్పారు. గ్రామాల్లో ప్రమాదకరంగా ఉన్న మలుపులను గుర్తించి, ఆయా గ్రామాల్లోని పెద్దల సహకారంతో మలుపుల్లో ఎదురుగా వచ్చే వాహనాలను ముందుగానే గుర్తించడానికి అనువుగా కాన్వెక్స్ మిర్రర్‌లు ఉపయోగపడతాయని తెలిపారు. దీంతో ప్రమాదాలు జరిగే అవకాశాలు తగ్గుతాయని ఆయన వివవించారు. వాహనదారులు మలుపుల్లో ప్రమాదాలు జరుగకుండా వాహనాలను జాగ్రత్తగా నడపాలని ఎస్ఐ సూచించారు. పెదవేగి మండలంలో విజయరాయిలో రెండుచోట్ల, కవ్వగుంట, ఎంఆర్‌సీ కాలనీ, వంగూరు గ్రామాల్లోని ప్రమాదకర మలుపుల్లో ఈ మిర్రర్‌లను ఏర్పాటు చేశారు. మిగిలిన ప్రమాదకర మలుపుల్లోకూడా త్వరలోకాన్విక్స్ మిర్రర్‌లను ఏర్పాటు చేస్తామని తెలిపారు

పితాని పుట్టినరోజు వేడుకలకు జనసేన మొక్కల పంపిణీ

ఆచంట, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి):ఎమ్మెల్యే పితాని సత్యనారాయణ జన్మదిన వేడుకలను పురస్కరించుకుని సోమవారం ఎ.వేమవరంలో జనసేన ఆధ్వర్యంలో మహిళలకు మొక్కలు, పేదలకు దుప్పట్లు పంపిణీ చేశారు. మంగళవారం రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేసినట్లు జన సైనికులు తెలిపారు. గుత్తుల శేఖర్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో చిట్టూరి శ్రీను, రావి హరిష్ పాల్గొన్నారు.


మొక్కలు అందజేస్తున్న జనసేన కార్యకర్తలు



నిబంధనలు పాటించకపోతే చర్యలు

నరసాపురం టౌన్, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి):సాంకేతిక లోపం పంటు గోదావరిలో నిలిచిపోవడంతోపాటు మరో పంటుకు తాడు కట్టి ఒడ్డుకు చేర్చిన ఘటనపై మండల పరిషత్ అధికారులు స్పందించారు. సోమవారం మాధవాయిపాలెం రేవును ఎంపీడీవో ఎస్.రెడ్డి సందర్శించారు. నిబంధనలకు అనుగుణంగా గోదావరి లో పంటు రాకపోకలు సాగించాలని, లేని పక్షంలో శాఖాపరంగా చర్యలు తీసుకుంటామని ఎంపీడీవో నాసిన రెడ్డి హెచ్చరించారు. పంటు సామార్థ్యం, ఎంత మంది ప్రయాణిస్తున్నారు, రెండు రేవుల మధ్య దూరం, లైఫ్ జాకెట్లు, జనరేటర్ల పనితీరును తనిఖీ చేశారు. ఎప్పటికప్పుడు పంటులు కండిషన్‌లో ఉండేలా చూడాలని పంటు నిర్వహాకులకు సూచించారు. అన్ని జాగ్రత్తలు తీసుకున్న తరువాతే నదిలో రాకపోకలు సాగించాలన్నారు. రికార్డులు, పంటు కండిషన్ సర్టిఫికేట్లు రెన్యూవల్ చేయించుకోవాలన్నారు.


ముఖ్యమంత్రికి అభివృద్ధి పనులు వివరిస్తున్న ఎమ్మెల్యే బొలిశెట్టి

సీఎంను కలిసిన ఎమ్మెల్యే బొలిశెట్టి

తాడేపల్లిగూడెం, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడి ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ సోమవారం వెలగపూడిలో సోమవారం కలిశారు. పీ4లో భాగంగా తాడేపల్లిగూడెం నియోజకవర్గంలో చేపట్టిన అభివృద్ధి పనులతో తయారు చేయించిన ఆల్బమ్‌ను సీఎంకు బొలిశెట్టి శ్రీనివాస్ చూపించారు. జరగాల్సిన పనుల వివరాలు తెలియజేశారు. పెండింగ్ పనులకు నిధులు మంజూరు చేయాలని సీఎంను కోరారు. దీనిపై చంద్రబాబు సానుకూలంగా స్పందించి నిధులు మంజూరు చేస్తానని భరోసా ఇచ్చారు. ఈ వివరాలను సోమవారం రాత్రి ఎమ్మెల్యే బొలిశెట్టి పాత్రికేయులకు వివరించారు.

సేవా కార్యక్రమాలు అభినందనీయం

తాడేపల్లిగూడెం, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): సేవా కార్యక్రమాలతో జనసేన కార్యకర్తలు ప్రజల మన్నన పొందాలని ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ సూచించారు. 34, 35 వార్డులకు చెందిన జనసైనికుడు అంగిన హరికృష్ణ రూపొందించిన అభివృద్ధి క్యాలండర్‌ను ఎమ్మెల్యే ఆవిష్కరించారు. 18 నెలలుగా నియోజకవర్గంలో తాను చేసిన అభివృద్ధిని గుర్తించి క్యాలండర్‌ను రూపొందించడం అభినందనీయమన్నారు. జనసైనికులు నీలపాల దినేష్‌యాదవ్, పాలూరి వెంకటేశ్వరరావు, వీర మహిళలు పాల్గొన్నారు.

క్యాన్సర్ రోగికి రూ.40 వేలు సాయం

పాలకొల్లు టౌన్, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): క్యాన్సర్ బాధిత కుటుంబానికి రూ.40 వేలు ఆర్థిక సహాయాన్ని అందజేశారు. యలమంచిలి మండలం పోలవరానికి చెందిన పొత్తూరి నరసింహరాజుకు నోటి క్యాన్సర్ వచ్చింది. కాస్మో క్లబ్ అధ్యక్షుడు గొట్టుముక్కల గాంధీ భగవాన్‌రాజు సూచనల మేరకు కార్యదర్శి వివి సోమరాజు రూ.20 వేలు, క్షత్రియ సంక్షేమ పరిషత్ అధ్యక్షులు చేకూరి సూరిబాబు, కార్యదర్శి డాక్టర్ కెఎస్‌పిఎన్ వర్మ పరిషత్ తరఫున రూ10వేలు, జిన్నూరుకు చెందిన పెన్మెత్స రామచంద్రరాజు రూ.10 వేలు వెరసి రూ.40 వేల చెక్కులను రోగి కుమార్తె లక్ష్మీ, అల్లుడు శ్రీనివాసరాజుకు అందజేసారు.

రూ.20 వేలు సహాయం

యాళ్లవానిగరువుకు చెందిన మూడేళ్ల బాలుడు జి.డేవిడ్ పాల్ కాంక్లియర్ ఇంప్లాంట్ చికిత్స నిమిత్తం వాకర్స్ క్లబ్ నుంచి రూ.20 వేలు, పెదపేటకు చెందిన నేతల ఎస్తేరు రాణి కీళ్ళ వ్యాధితో బాధపడుతున్న విషయం తెలిసి ఆమెకు రూ.7 వేలు విలువైన మందులను అందజేశారు.

ఆలయాల అభివృద్ధికి రూ.7.80 కోట్లు : ఎమ్మెల్యే రాధాకృష్ణ

తణుకు, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలోని మూడు ఆలయాల అభివృద్ధికి ప్రభుత్వం 7.80కోట్లు మంజూరు చేసినట్లు ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ చెప్పారు. సోమవారం క్యాంపు కార్యాలయం నుంచి ప్రకటన విడుదల చేసారు. ఇరగవరం మండలం రేలంగి లక్ష్మి నరసింహస్వామి ఆలయానికి రూ.3 కోట్లు, దువ్వ దానేశ్వరి ఆలయానికి రూ.3 కోట్లు, వేల్పూరు రుద్రేశ్వరస్వామి ఆలయానికి 1.80 కోట్లు మంజూరు చేసిందన్నారు. ఆలయాల అభివృద్ధికి నిధులు కేటాయించాలని ప్రభుత్వానికి చేసిన విజ్ఞప్తి మేరకు సీఎం చంద్రబాబు నిధులను మంజూరు చేసినట్లు పేర్కొన్నారు. 30 శాతం ప్రజలు భాగస్వామ్యంతో ఈ నిధులను ఆలయాల అభివృద్ధికి వినియోగించనున్నట్లు ఆయన చెప్పారు.

విద్యార్థినులు అప్రమత్తంగా ఉండాలి

పాలకొల్లు అర్బన్, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి):విద్యార్థినులు అపరిచితులతో జాగ్రత్తగా ఉండాలని జిల్లా చైల్డ్ వెల్ఫేర్ అసోసియేషన్ సీసీ మమత అన్నారు. పోలీసులు, చైల్డ్‌వెల్ఫేర్ అసోసియేషన్ సంయుక్తంగా బిఆర్‌ఎంవిఎంహైస్కూల్, సుభాష్ చంద్రబోస్ హైస్కూల్స్‌లో సోమవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఏఎస్‌ఐ మార్లింగం, ఎంఈవో గుమ్మళ్ళ వీరాస్వామి, హెచ్‌ఎంలు, ఐసిడిఎస్ సూపర్‌వైజర్ సత్యవేణి, ఎంఎస్‌కే శ్రీదేవి, అనూష, అంగన్‌వాడీలు, ఏఎన్‌ఎంలు పాల్గొన్నారు.











వాటర్ ట్యాంకర్లు శుభ్రం చేయండి : అధికారులకు విజ్ఞప్తి

నరసాపురం రూరల్, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి):మంచినీటి ప్రాజెక్టుల ఓహెచ్‌ఆర్‌లను నెల వారీగా శుభ్రపర్చకపోవడంతో ప్రజలు కలుషిత నీటిని తాగాల్సి వస్తోందని జడ్పీటీసీ బొక్కా రాధాకృష్ణ, వైస్ ఎంపీపీ రమేష్‌నాయుడు, ఎంపీటీసీ సత్యనారాయణ ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ తాడి లోకేశ్‌ను నిలదీశారు. సోమవారం మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ సోని అధ్యక్షత జరిగిన సమావేశంలో ప్రజలకు ఉపయోగపడే విధంగా వాటర్ ట్యాంకర్‌లు కట్టాలని వీసీ రమేష్‌నాయుడు, గ్రామాల్లో తాగునీటి ఇబ్బందులు పరిష్కారానికి పైప్‌లైన్లు ఏర్పాటు చేయాలని సుజాత, బందెల భారతి, అంగన్‌వాడీ కేంద్రాల చుట్టూ గోడ నిర్మించాలని నక్కా లక్ష్మీనారాయణ, గ్రామాల్లో తమకు తెలియకుండానే అభివృద్ధి పనులకు తీర్మానాలు చేయడంతోపాటు పనులు చేస్తున్నారని ఎంపీటీసీ మేరీరత్నం సభ దృష్టికి తీసుకొచ్చారు.

లయన్ ఆఫ్ డిస్ట్రిక్ట్‌గా ముత్యాల రామారావు



పాలకొల్లు, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): పట్టణానికి చెందిన సీనియర్ పాత్రికేయుడు ముత్యాల రామారావు 316 డి (కృష్ణా) జిల్లాకు 2024-25కి లయన్ ఆఫ్ ది డిస్ట్రిక్ట్‌గా ఎంపికయ్యారు. ఆదివారం విజయవాడలో జరిగిన కార్యక్రమంలో డిస్ట్రిక్ట్ గవర్నర్ గద్దే శేషగిరిరావు అవార్డును అందించారు. ఇంటర్నేషనల్ ప్రెసిడెన్షియల్ మెడల్‌ను జిల్లా గవర్నర్ వీవీపీఎస్ ఆంజనేయులు సమక్షంలో ఇంటర్నేషనల్ డైరెక్టర్ డి.సుబాష్‌బాబు అందజేశారు.

38 మందికి మంత్రి నిమ్మల సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు పంపిణీ

పాలకొల్లు అర్బన్, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి) :పేద మధ్య తరగతి ప్రజలకు ప్రభుత్వం వైద్య సహాయంగా సీఎంఆర్‌ఎఫ్ నిధి నుంచి ఆర్థిక భరోసా కల్పిస్తోందని మంత్రి నిమ్మల రామానాయుడు అన్నారు. సోమవారం మంత్రి కార్యాలయంలో 38 మంది లబ్ధిదారులకు రూ.15.50 లక్షల విలువైన చెక్కులను మంత్రి లబ్ధిదారులకు అందజేశారు.

సంక్షేమమే కూటమి ప్రభుత్వ లక్ష్యం

తాడేపల్లిగూడెం : సంక్షేమమే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం పని చేస్తుందని జనసేన మండల అధ్యక్షుడు అడపా ప్రసాద్ అన్నారు. ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో సోమవారం 8 మంది లబ్ధిదారులకు రూ.13 లక్షల సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను అందజేశారు.

నేడు ఉచిత ఆర్థోపెడిక్ క్యాంపు

అత్తిలి, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): అత్తిలి లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఉచిత ఆర్థోపెడిక్ క్యాంపును మంగళవారం ఏర్పాటు చేసినట్లు క్లబ్ పీఆర్వో యాతం రాంబాబు తెలిపారు. తణుకుకు చెందిన డాక్టర్ ఎం.రాజేందర్ ఎముకలకు సంబంధించిన రోగులను పరీక్షించి ఉచితంగా మందులు అందజేస్తారని తెలిపారు. ప్రజలు ఈ శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

జీవితంలో ఏం సాధించలేదంటూ..

మొగల్తూరు, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి):తాను జీవితంలో ఏం సాధించలేదు. అలాగే ఏ పని చేయలేకపోతున్నానంటూ సీతారామపురానికి చెందిన కూర్మా ఆనంద్ కుమార్ (25) ఈ నెల 1న మనస్థాపానికి గురై పురుగుల మందు తాగాడు. దీనిని గుర్తించిన కుటుంబ సభ్యులు అతనిని వైద్యం నిమిత్తం నరసాపురం నుంచి విజయవాడ ప్రభుత్వాసుపత్రికి తరలించి చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందాడు. ఆసుపత్రి నుంచి వచ్చిన సమాచారం మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు మొగల్తూరు హెడ్ కానిస్టేబుల్ సుబానీ తెలిపారు.















12న కలెక్టరేట్‌లో రక్తదాన శిబిరం

భీమవరం టౌన్, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): కలెక్టరేట్‌లో ఈ నెల 12న రక్తదాన శిబిరం జరుగుతుందని జేసీ టి.రాహుల్ కుమార్ రెడ్డి తెలిపారు. రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో జిల్లాలో 2026 వార్షిక రక్తదాన శిబిరాల గోడపత్రికను సోమవారం ఆయన ఆవిష్కరించారు. జిల్లాలోని అన్ని ప్రభుత్వ శాఖల సిబ్బందితో ప్రతి నెలా రక్తదాన శిబిరాలు జరుగుతాయన్నారు. మొదట శిబిరం కలెక్టరేట్‌లో నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. రక్తదానంతో తలసీమియా, ప్రమాదాల్లో బాధితులకు ప్రాణదానం చేయడమేనన్నారు.

రేపు చాంబర్స్ కళాశాలలో పాస్‌పోర్టు సర్వీస్ కేంద్రం

పాలకొల్లు అర్బన్, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి):భీమవరం పాస్‌పోర్టు సెంటర్ ఆధ్వర్యంలో ద్వారా ఈ నెల 10, 11 తేదీలలో ఛాంబర్స్ కళాశాలలో పాస్‌పోర్టు మేళా నిర్వహిస్తున్నట్లు కళాశాల పాలక మండలి ఛైర్మన్ కేవీఆర్ నరసింహారావు సోమవారం తెలిపారు. విద్యార్థులు, సిబ్బంది, సామాన్య ప్రజలు ఈ అవకాశాన్ని వినియోగించుకోవచ్చునని, ఆధార్‌కార్డు, ఎస్ఎస్‌సీ మార్కుల లిస్టు, రూ.18.50 నగదు తీసుకుని రావాల్సి ఉంటుందని, ఇతర వివరాలకు 77807 18646 నంబర్‌లో సంప్రదించవచ్చని ఆయన తెలిపారు.

ప్రభుత్వ డిగ్రీ కళాశాల మూడో సెమిస్టర్ ఫలితాలు విడుదల

పాలకొల్లు అర్బన్, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి):స్థానిక ఏఎస్ఎన్ఎం ప్రభుత్వ డిగ్రీ కళాశాల(అటానమస్) 3వ సెమిస్టర్ ఫలితాల్లో 75 శాతం ఉత్తీర్ణత సాధించినట్టు ప్రిన్సిపాల్ టి.రాజరాజేశ్వరి తెలిపారు. కళాశాలలో సోమవారం ఫలితాలు విడుదల చేశారు. 199 మంది విద్యార్థులకు 149 మంది ఉత్తీర్ణులైనట్టు తెలిపారు. 5వ సెమిస్టర్‌లో 157 మందికి 154 మంది (98శాతం) ఉత్తీర్ణులయ్యారని తెలిపారు. ఎంఏ ఎకనామిక్స్, ఎకాం, ఎంఎస్‌సీ ఆక్వాకల్చర్ పీజీ కోర్సుల్లో స్పాట్ అడ్మిషన్‌కు అర్హులు ఈనెల 12లోపు రిజిస్ట్రేషన్లు చేయించుకోవచ్చునని ప్రిన్సిపాల్ తెలిపారు.









నరసాపురం, తణుకు డీసీసీబీ శాఖల వద్ద ఉద్యోగులు ధర్నా, తాడేపల్లిగూడెంలో ధర్నా అనంతరం వినతిపత్రం ఇస్తున్న ఉద్యోగులు

సమస్యలు పరిష్కరించండి

సహకార సంఘ ఉద్యోగుల ధర్నా

నరసాపురం టౌన్/తణుకు/తాడేపల్లిగూడెం రూరల్/గణపవరం /భీమవరం రూరల్/పాలకొల్లు అర్బన్, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): సమస్యలను పరిష్కరించాలని డీసీసీబీ శాఖల వద్ద సహకార సంఘ ఉద్యోగులు సోమవారం ఆందోళన చేపట్టారు. జీవో నెంబర్ 36 అమలు చేయాలని, గ్రాడ్యుటీ యాక్టు, రిటైర్మెంట్ వయస్సు 62కు పెంచాలని, 2019లో ఉద్యోగంలో చేరిన వారందర్నీ రెగ్యులర్ చేయాలని, సొసైటీ లాభనష్టాలతో సంబంధం లేకుండా జీతాలు చెల్లించాలని నినాదాలు చేశారు. నరసాపురంలో బ్రాంచ్ మేనేజర్ శ్రీవాణికి వినతిపత్రం అందించారు. దాసరి శ్రీను, వెంకటేశ్వరావు, ఎం త్రిమూర్తులు, కవురు పెద్దిరాజు, టి.సత్యనారాయణ, రామ్మోహన్‌రావు, తదితరులు పాల్గొన్నారు. తణుకులో సిఐటియూ జిల్లా కార్యదర్శి పీవీ.ప్రతాప్, సహకార సంఘాల ఉద్యోగుల రాష్ట్ర నాయకులు చిల్ల కూరి వెంకటేశ్వరరావు, సహకార ఉద్యోగుల జేఏసీ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. యూనియన్ నాయకులు కొల్లి సత్యనారాయణ, గోపాలరావు, విష్ణుమూర్తి, సుబ్బారాయుడుతో పాటు పలువురు పాల్గొన్నారు. తాడేపల్లిగూడెం డీసీసీబి మేనేజర్ బసవ సత్యనారాయణకు వినతిపత్రం అందించారు. గణపవరంలో సహకార ఉద్యోగుల నాయకులు బీటీప నారాయణ, బుద్దాల తాతా అనే నారాయణ, కవల రాజేశ్, చిక్కాల శ్రీనివాస్, నిమ్మల హరినాథ్ బాబా, కొత్తపల్లి సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు. భీమవరంలో డీసీసీబీ వద్ద ధర్నాలో పాలకోడేరు, కాళ్ల, భీమవరం మండలాల్లోని సహకార సంఘ ఉద్యోగులు పాల్గొన్నారు. పాలకొల్లులో ఉద్యోగ సంఘం జిల్లా నాయకుడు పి.కృష్ణారావు, ఎం.మురళీకృష్ణ, కె.కృష్ణకిషోర్, ఆకుల వెంకటేశ్వరరావు, బి.శ్రీనివాసరావు, గుడాల ప్రసాదరావు తదితరులు పాల్గొన్నారు.

టీబీ బాధితులు జాగ్రత్తలు తీసుకోవాలి



పీహెచ్‌సీ వద్ద టీబీ కార్యక్రమం

పాలకొల్లు, డిసెంబరు8 (ఆంధ్రజ్యోతి): టీబీ బాధితులు చలిలో తిరగరాదని, క్రమం తప్పకుండా మందులు వాడుతూ అదనపు పోషకాహారం తీసుకోవాలని రోటర్లీ క్లబ్ అధ్యక్షుడు డాక్టర్ కోసూరి రామకృష్ణ ఆనందరాజు అన్నారు. లంకలకోడేరు పీహెచ్‌సీలో సోమవారం 20 మందికి మందుల కిట్లను అందజేశారు. పీహెచ్‌సీ వైద్యుడు నవ్య జీవన్ మాట్లాడుతూ బాధితులను గుర్తించి ఆరునెలల పాటు ఉచితంగా మందులు అందిస్తామన్నారు. కార్యక్రమంలోగుడాల హరిబాబు, రోటరీ సభ్యులు, పిహెచ్‌సి సిబ్బంది పాల్గొన్నారు.



క్యాడెట్స్‌లో దేశభక్తి పెంపొందించడమే లక్ష్యం

తణుకు, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి):ఎన్‌సీసీ క్యాడెట్స్‌లో దేశ భక్తిని పెంపొందించడమే లక్ష్యం అని ఎస్‌కేఎస్‌డి మహిళా కళాశాల ప్రిన్సిపల్ యు.లక్ష్మీసుందరీ బాయి అన్నారు. సోమవారం ఎన్‌సీసీ విభాగం ఆధ్వర్యంలో ఫ్లాగ్ డే నిర్వహించారు. క్యాడెట్స్ విరాళాల సేకరణకు ప్రిన్సిపల్ జెండా ఊపి ప్రారంభించారు. ఆమె మాట్లాడుతూ దేశం కోసం ప్రాణ త్యాగం చేసిన సైనికులకు, వారి కుటుంబాలకు సహాయం చేయడం కోసం విరాళాలు సేకరణ జరుగుతుందన్నారు.

కూటమి ప్రభుత్వాన్ని ఆశీర్వదించండి

● మంత్రి నిమ్మల రామానాయుడు


దమ్మయ్యపర్తి డ్రెయిన్‌పై నిర్మించనున్న వంతెన పనులకు శంకుస్థాపన చేస్తున్న మంత్రి డాక్టర్ నిమ్మల రామానాయుడు

పాలకొల్లు అర్బన్, డిసెంబరు8 (ఆంధ్రజ్యోతి): వేగవంతంగా అభివృద్ధి పనులు చేస్తున్న కూటమి ప్రభుత్వాన్ని ఆశీర్వదించాలని మంత్రి నిమ్మల రామానాయుడు అన్నారు. పట్టణంలోని రూ.14 కోట్లతో దమ్మయ్యపర్తి మురుగు డ్రెయిన్ నిర్మాణ పనులను ఆయన సోమవారం పరిశీలించారు. దీనిలో భాగంగా రామయ్యహాలు జిప్లస్1 కాలనీ ప్రాంతంలో రూ.25 లక్షలు, మరో ఏరియాలో రూ.25 లక్షలతో నిర్మించనున్న వంతెన పనులకు మంత్రి నిమ్మల శంకుస్థాపన చేసారు. సమస్యలను అడిగి తెలుసుకుని సాధ్యమైనంత త్వరలో పరిష్కరిస్తామని మంత్రి హామీ ఇచ్చారు. దమ్మయ్యపర్తి డ్రెయిన్ పనులు గతంలో టీడీపీ హయాంలో ప్రారంభించడం జరిగింది. అనంతరం వచ్చిన వైసీపీ ప్రభుత్వం నిర్లక్ష్యం చేసిందన్నారు. కూటమి నాయకులు పెచ్చెట్టి బాబు, గండేటి వెంకటేశ్వరరావు, కర్నేన గౌరునాయుడు, కర్నేన రోజారమణి, వల్లభ శ్రీనివాస్, ఉన్నమట్ల కపర్థి, తులారామలింగం,పి లక్ష్మీనారాయణ, మీసాల రాము, తదితరులు పాల్గొన్నారు.

నరసాపురం ఆర్డీవో కార్యాలయంలో 37 వినతులు



అర్జీలు స్వీకరిస్తున్న ఆర్డీవో దాసిరాజు

నరసాపురం, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి):సబ్ కలెక్టర్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమ స్యల పరిష్కార వేదికకు 37 వినతులను ఆర్డీవో దాసి రాజు స్వీకరించారు. సీతారాంపురం రాజులపాలెంకు చెందిన చెరుకూరి ప్రసాదరాజు గ్రామానికి చెందిన కొంత మంది తమ కుటుంబాన్ని చంపుతామని బెదిరిస్తు న్నారంటూ, రక్షణ కల్పించాలని విన్నవించారు. కాల్వ పూడిక, పింఛన్, సరిహద్దు సమస్యలు విన్నవించారు.

మొగల్తూరు: మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో 2 ఫిర్యాదులు అందినట్టు తహసీల్దార్ కె.రాజ్ కిశోర్ తెలిపారు. రామన్నపాలెం పంచాయతీ లక్కు వారితోటలోని ప్రభుత్వ భూమిలో పక్కా భవనం నిర్మించారని, దీనిపై చర్యలు తీసుకోవాలని అడ్డాల రాంబాబు ఫిర్యాదు చేశారు. మొగల్తూరు గాంధీబొమ్మల సెంటర్ నుంచి వెంప రహదారి నిర్మించాలని పడమటిపాలెం గ్రామస్థులతో పాటు సీపీఎం నాయకులు ఫిర్యాదు చేశారు. ఎంపీడీవో త్రిశూలపాణి, పీఆర్ ఏఈ వెంకటేశ్వరరావు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.









దివ్యాంగుల సంక్షేమానికి కట్టుబడిన ప్రభుత్వం


చంద్రబాబు, పవన్‌ల ఫ్లెక్సీకి పాలాభిషేకం చేస్తున్న నాయకర్

నరసాపురం టౌన్, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): దివ్యాంగుల సంక్షేమానికి కూటమి ప్రభుత్వం కట్టుబడి పని చేస్తుందని విప్ నాయకర్ అన్నారు. ఇంద్రధనస్సు (7 వరాలు) పథకాన్ని అమల్లోకి తేవడంతో దివ్యాంగులతో కలిసి పట్టణంలోని వలంధర్ రేవులో నాయకర్ సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌ల ఫ్లెక్సీలకు సోమవారం పాలాభిషేకం చేశారు. ఆనంతరం భారీ కేక్ కట్ చేశారు. దివ్యాంగులకు మనోధైర్యం, భరోసా కల్పించాలన్నదే ప్రభుత్వ లక్ష్యమన్నారు. కోటిపల్లి వెంకటేశ్వరావు, మైలా వసంతరావు, గుత్తుల వాసు, వలవల నాని, కనకరాజు, గంగాధర్ పాల్గొన్నారు.

పారా ఒలింపిక్స్‌లో 'విభిన్న' ప్రతిభ

ఆకివీడు, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): పారా ఒలింపిక్స్‌ల ఆకవీడు విద్యార్థులు ప్రతిబ కనబరిచారు. మరింత ప్రతిభతో పోటీల్లో ఉత్తమ ఫలితాలు సాధించాలని జడ్పీ ఉన్నత పాఠశాల హెచ్ఎం పారానాయుడు అన్నారు. ప్రపంచ దివ్యాంగుల వారోత్సవాలు సందర్భంగా ఈ నెల 7న భీమవరంలోని డీఎన్ఆర్ కళాశాలలో సమగ్ర శిక్ష ఆధ్వర్యంలో నిర్వహించిన జిల్లా స్థాయి పోటీలో షాట్‌పుట్‌లో ఎన్.క్రాంతి, డిస్కస్‌త్రోలో ముత్యాలరావుకు మొదటి బహుమతి, రన్నింగ్‌లో పి.సాయి, అయ్యప్పకు రెండో బహుమతి, రన్నింగ్‌లో పి.అలేఖ్య, షాట్‌పుట్‌లో సాయిదుర్గ, రన్నింగ్, షాట్‌పుట్‌లో నందినికి మూడవ బహుమతి లభించాయన్నారు. విద్యార్థులు ఇంతటి మెడల్స్ సాధించడానికి కృషి చేసిన ప్రత్యేక విద్య ఉపాధ్యాయురాలు బ్రైటీ బ్యూలాను హెచ్ఎం అభినందించారు.

దివ్యాంగుల భవితకు కృషి

పాలకోడేరు, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి):అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవాన్ని పురస్కరించుకుని ఎంఈవో నాగరాజు ఆధ్వర్యంలో సోమవారం ప్రత్యేక సమావేశం నిర్వహించారు. దివ్యాంగులను భవిత కేంద్రానికి పంపించడం వల్ల మనోవికాసంతో పాటు ప్రతిభకు ప్రోత్సాహం ఉంటుందన్నారు. పిల్లలు, వారి తల్లిదండ్రులతో కలిసి భోజనాలు చేశారు. ప్రతి ఒక్క దివ్యాంగ విద్యార్థికి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో రమణరాజు, ప్రసాద్, సింహాచలం, చంద్రకళ, ఐఇఆర్‌టి ఉపాధ్యాయులు ఝాన్సీ, జానకి, అంజి, తదితరులు పాల్గొన్నారు.

పెండింగ్ క్లెయిమ్స్ పరిష్కరించాలి

తాడేపల్లిగూడెం, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): భవన నిర్మాణ కార్మికుల పెండింగ్ క్లెయిమ్‌లు వెంటనే పరిష్కరించాలని ఐఎఫ్‌టీయూ నాయకుడు మామిడి దాన వరప్రసాద్ డిమాండ్ చేశారు. సోమవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ కూటమి అధికారం చేపట్టి 18 నెలలు కావస్తున్నా హామీలు అమలు చేయలేదన్నారు. నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

